క్లుప్తంగా

శ్రమదానంతో మదుముకు మరమ్మతులు


ట్రాక్టర్‌తో మట్టి వేస్తున్న రైతులు

సారవకోట: మండల కేంద్రంలోని గజపతి సాగరం చెరువు ఆయకట్టు రైతులు చేయి చేయి కలిపి మదుమును బాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న మదుముకు రంధ్రాలు పడడంతో వర్షం నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టు రైతులు సుమారు రూ. 15 వేలు సేకరించి మదుము చుట్టూ మట్టి కప్పారు. మదుముకు రంధ్రాలు పడడంతో చెరువులో నీరు నిల్వ ఉండక సుమారు 150 ఎకరాల్లో ఈ ఏడాది రబీలో అపరాలు వేసుకోలేక పోయామని రైతులు చెప్పారు. దీంతో తామే శ్రమదానంతో మదుమును బాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

సర్వే సరిహద్దు రాళ్లు సిద్ధం


కృష్ణాపురం వద్ద సిద్ధంగా ఉన్న సర్వే రాళ్లు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూమి సరిహద్దు సర్వేరాళ్లు గ్రామాలకు చేరుకుంటున్నాయి. మండలంలో ఇప్పటికే సర్వే పూర్తి చేసుకున్న రెవెన్యూ గ్రామాల్లో సరిహద్దు రాళ్లు పాతేందుకు వీటిని రప్పించామని మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య తెలిపారు. సర్వే రాళ్లు ఆయా రెవెన్యూ గ్రామాల వారీగా తరలించి అందుబాటులో ఉంచామన్నారు. మండలంలో 47 రెవెన్యూ గ్రామాలకు గాను మొదటి విడతలో 16, రెండో విడతలో 27 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు.

తురకపేటలో ఉచిత వైద్య శిబిరం


రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ సురేష్

ఆమదాలవలస రూరల్: తురకపేట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యుడు బొడ్డేపల్లి సురేష్ సుమారు రెండు వందల మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎరువుల అమ్మకం


ఆర్బీకేలో సిద్ధంగా ఉన్న ఎరువులు

ఎల్.ఎన్.పేట: తురకపేట రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు సోమవారం నుంచి ఎరువులను విక్రయించనున్నట్లు వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ తెలిపారు. ఆర్బీకేకి 20 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ వచ్చిందన్నారు. మొదటి విడతగా విక్రయం పూర్తి చేసిన తరువాత రెండో విడత ఎరువు వస్తుందన్నారు. ఎంత ఎరువు కావాలన్నా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: తురకపేట గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఆదివారం చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్ మామిడి దమయంతి గ్రామస్తులకు సూచించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


బాలసూర్య ప్రసాదరావు (ఫైల్)

సారవకోట: బద్రి పంచాయతీ మాజీ సర్పంచ్ మెండ బాల సూర్య ప్రసాదరావు ఆదివారం విశాఖలో మృతి చెందారు. ఈయన భూగర్భ జలవనరుల శాఖలో పని చేసేవారు. ఉద్యోగ విరమణ అనంతరం గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ తరఫున సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఈయన భార్య పావని ప్రముఖ గైనకాలజిస్టు. ప్రసాదరావు మృతికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ సంతాపం తెలియజేశారు.

గృహ యోగం!

- నెరవేరుతున్న పేదల కల
- అర్హులందరికీ ఇళ్లు మంజూరు
- ఆనందంలో లబ్ధిదారులు


దబ్బపాడులో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల వారికీ మేలుజరుగుతోంది. గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి నెరవేర్చుతున్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంతో వందలాది మంది పేదల సొంతింటి కల నెరవేరుతోంది. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థలం కేటాయించడంతోపాటు ఇంటిని కట్టించి ఇస్తుండడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలను జోరుగా చేపడుతున్నారు.

గతంలో..

చంద్రబాబు పాలనలో ఉన్నవారికే కాలనీ ఇళ్లు మంజూరయ్యేవి. కొత్తగా ఇళ్లు కట్టినట్లు కలరింగ్ ఇచ్చి అధికారులను భయపెట్టి, ప్రలోభ పెట్టి గృహ నిధులు స్వాహా చేసుకునేవారనే విమర్శలు ప్రజల నుంచి వచ్చేవి. నిజమైన లబ్ధిదారులు ఇల్లు కట్టుకుంటామని అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదు.

నేడు..

గ్రామాల్లో వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. నిజమైన పేదలకే ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇళ్ల స్థలం మంజూరు చేసిన వారికే కాలనీ ఇళ్లు కేటాయించారు. దీంతో పండుగ వాతావరణంలో పేదలు ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు.

ఎల్.ఎన్.పేట మండలంలో పరిస్థితి ఇలా..	
మొత్తం గ్రామ సచివాలయాలు	12
పట్టాలు పొందిన లబ్ధిదారులు	342
ఇళ్లు మంజూరైన వారు	342
కాలనీ ఇళ్లు నిర్మాణాలు ప్రారంభమైన గ్రామాలు	తురకపేట, దబ్బపాడు, మిరియాపల్లి, కరకవలస, ధనుకువాడ, పెద్దకొల్లివలస


తురకపేటలో కాలనీ ఇళ్ల నిర్మాణం



ఈమె పేరు గుడివాడ ధనలక్ష్మి. తురకపేట గ్రామం, సొంత ఇంటి స్థలం కూడా లేని పేదరాలు. వివాహమై సుమారు 25 ఏళ్లు అవుతుంది. కన్నవారి ఇంట్లోనే ఉంటూ తురకపేట సెంటర్లో టీదుకాణం నడుపుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటుంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి స్థలం ఇచ్చి గృహాన్ని మంజూరు చేశారు. సొంతింటి కల నెరవేరుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తోంది. జీవితాంతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని చెబుతుంది.



ఈమె పేరు బగ్గు భవాని.. దబ్బపాడు గ్రామం. సుమారు 15 ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి కన్నవారింట్లో ఉంటుంది. నాలుగేళ్ల క్రితం కన్నవారి ఇంటి నుంచి బయటకు వచ్చి పరాయి పంచన ఉంటూ కూలి పనులు చేసుకుని జీవితం గడుపుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి స్థలం కేటాయించడంతోపాటు ఇంటిని మంజూరు చేశారు. గృహ నిర్మాణం కూడా ప్రారంభించింది.

తక్షణమే బిల్లుల చెల్లింపు



గృహ లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు చెల్లిస్తున్నాం. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి మట్టి తవ్వకం, నిర్మాణ సామగ్రి తీసుకువస్తే రూ.20 వేలు, పునాది స్థాయితో నిర్మాణం పూర్తయితే మరో రూ.70 వేలు చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలి. నిర్మాణ పనులు స్థాయిని బట్టి రూ.1.80 లక్షలు చెల్లిస్తున్నాం.

– కె.రమేష్,
హౌసింగ్ ఏఈ, ఎల్.ఎన్.పేట

లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించాలి

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పేదలకు మరింతగా సేవలు అందించాలని సూచించారు. స్థానిక మిలీనియం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో నరసన్నపేట క్లబ్‌కు మంచి పేరు ఉందని దీన్ని నిలబెడుతూ రానున్న ఏడాదిలో మంచి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్లబ్‌కు శాశ్వత భవనం నిర్మాణానికి పది సెంట్ల స్థలం విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. కాగా క్లబ్ అధ్యక్షుడుగా సదాశివుని కృష్ణ, కార్యదర్శిగా వి.నాగరాజు, ట్రెజరర్‌గా పి.రమేష్‌లు బాధ్యతలు చేపట్టారు. ఏడాది పాటు ఈ కార్యవర్గం కొనసాగుతోంది. కార్యక్రమంలో జిల్లాలోని సీనియర్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాస్ట్ పీడీజీలు డీఎస్ఎస్‌వీ వర్మ, డి.రాఘవేంద్రరావు, టి.శ్రీనివాసరావు, వి.రంగనాథ్, ఎన్.మోహన్ పాల్గొన్నారు. అలాగే ఇప్పటి వరకూ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించిన బాలకృష్ణ, సాయి శ్రీనివాస శర్మలు గడిచిన ఏడాదిలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

సొంత నిధులతో చప్టా నిర్మాణం


చప్టా నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

సారవకోట: అలుదు గ్రామంలోని బందరువాని చెరువుకు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ సొంత నిధులతో చప్టా నిర్మాణం చేపడుతున్నారు. జాతీయ రహదారి 326–ఏ రోడ్డు నిర్మాణ పనులు జరిగే సమయంలో బందరువాని చెరువుకు చప్టాను నిర్మించకుండా కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. దీంతో వర్షాలు పడే సమయంలో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లిపోతుంది. రైతులు ఆ సమయంలో ఆందోళన చేపట్టిన సంబంధిత జాతీయ రహదారి అధికారులు స్పందించ లేదు. ఈ ఏడాది వర్షాలు పడే సమయంలో రైతులు మళ్లీ అదే సమస్యను ఎదుర్కొకుండా ఉండేందుకు లక్ష రూపాయలు వెచ్చించి చప్టా నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డాక్టర్ గ్రీష్మ

మెళియాపుట్టి: ఆరోగ్యంపై విద్యార్థినులు శ్రద్ధ వహించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు గ్రీష్మ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని ఆదివారం సందర్శించారు. నలుగురు విద్యార్థినులు ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన నేపథ్యంలో పాఠశాలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. తల్లిదండ్రులు బయటనుంచి తెచ్చి ఇచ్చిన పచ్చళ్లు, చిరుబండారాలను తినడం వల్లే పిల్లలు వాంతులైనట్లు గుర్తించామన్నారు. ఆదివారం కావడంతో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడారు. వారికి అవగాహన కల్పించారు. బయటనుంచి ఎటువంటి తినుబండారాలను తీసుకు రావొద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విలువైన పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తూ ఉందని, మెనూ ప్రకారం అందించే ఆహారం మాత్రమే తీసుకోవాలన్నారు. కొందరు బయటనుంచి తెచ్చిన వాటిని తిరిగి పంపించేశారు. ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు స్వర్ణలత, సుజాత ఉన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన ఉండాలి


శిక్షణ పొందిన ఢిల్లీ విద్యార్థులు

బూర్జ: వ్యవసాయ ఉత్పత్తులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దపేట ఆర్డ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. ఢిల్లీలోని కర్త సంస్థకు చెందిన ఏడుగురు విద్యార్థులకు 45 రోజులు పాటు ఇచ్చిన వృత్తి నైపుణ్య శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఆర్డ్స్ సంస్థకు వచ్చి ఎన్నో విషయాలు నేర్చుకోవడంతోపాటు క్షేత్ర సందర్శన చేస్తున్నారన్నారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన పెంచుకుంటున్నారన్నారు. ఆదివాసీ సాధికారిక, బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ కోసం విద్యార్థులు ఇక్కడకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


మాట్లాడుతున్న శ్రీను సిద్ధాంతి

పొందూరు: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రజలంతా పాటు పడడంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని పట్టణానికి చెందిన శ్రీను సిద్ధాంతి, విష్ణుదేవానంద స్వామిలు అన్నారు. లైదాం శివానంద ధర్మక్షేత్రంలో ఆదివారం సత్సంగ మాధురి నిర్వహించారు. హిందువుగా పుట్టడం, మరణించడం మనం చేసుకున్న పుణ్యమన్నారు. హిందూ ధర్మాన్ని పీఠాధిపతులు, ధర్మక్షేత్రాధిపతులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో లైదాం శివానంద ధర్మక్షేత్రం నిర్వాహకులు గొర్లె అనంతరామక్రిష్ణ, స్వామీజీలు, భక్తులు పాల్గొన్నారు.

'ప్రజాపాటల పందిరి' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పొందూరు: తాడివలస గ్రామంలో ప్రజా గాయకుడు, ప్రజా నాట్యమండలి కళాకారుడు పందిరి రాము రచించిన ప్రజా పాటల పందిరి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఉద్యమ గీతాలు రచనలు చేయడం, అనర్గళంగా పాడటంలో పందిరి రాము పట్టు సాధించారు. రాము తమ గ్రామంలో పుట్టడం తమకెంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మణెమ్మ, విశ్రాంత ఆర్ఐవో భట్లు, విశ్రాంత అధ్యాపకులు అన్నా రామానుజాచార్యులు, నీలంనాయుడు, విష్ణువర్ధనరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎంఈవో–1గా పీవీ రామరాజు


రామరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: పొందూరు ఎంఈవో–1గా జలుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పీవీ రామరాజు నియమితులైయ్యారు. ఇటీవలే పొందూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహించి జలుమూరు మండలం బదిలీపై వెళ్లాను. జిల్లాలో ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మళ్లీ పొందూరు మండల విద్యాశాఖాధికారిగా నియమితులయ్యారు. ఆదివారం రామరాజు విధుల్లో చేరారు.

4న గూనభద్ర, లబ్బలో 'జగనన్న సురక్ష'

కొత్తూరు: గూనభద్ర, లబ్బ గ్రామ సచివాయాల్లో ఈ నెల నాలుగో తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.పావని ఆదివారం తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గురువే ప్రత్యక్ష దైవం


మాట్లాడుతున్న చిట్టిపంతులు


ఆమదాలవలస: గురువే ప్రత్యక్ష దైవమని ఆమదాలవలస పట్టణానికి చెందిన వేదపండితులు బలివాడ చిట్టిపంతులు అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలో ఆదివారం గురుపూజోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనే శ్లోకాల్లో తల్లిదండ్రులు తరువాత ప్రతి ఒక్కరిపైన అమితమైన ప్రేమ చూపిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించే వ్యక్తి గురువు అని అన్నారు. మన జీవితాన్ని పణంగా పెట్టినా గురువుల రుణం తీర్చుకోలేమన్నారు. గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాత్రో, సంఘ సంస్కర్త, రొటేరియన్ జె.కె. వెంకుబాబు, పలు ప్రాంతాలకు చెందిన స్వయం సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

సమాజంలో గురువుది ఉన్నతస్థానం


సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్

సారవకోట: సమాజంలో గురువుకు ఉన్నతస్థానం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ జలుమూరు శాఖ ఖండ కార్యావహ పిల్లల ఉమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వ్యాస పౌర్ణమి పురస్కరించుకుని గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మంలో వ్యాస భగవానుడే ఆదిగురువని అన్నారు. అలాగే ప్రస్తుతం సమాజాభివృద్ధిలో గురువు స్థానాన్ని వివరించారు. ఆయనతో పాటు వైద్యులు యోగేంద్రరావు, సర్పంచ్ శంకర బాబు, సమీకృత వసతిగృహాధికారి బి.మోహనరావు తదితరులున్నారు.

పెద్దచెరువును కమ్మేసిన గుర్రపుడెక్క


గుర్రపు డెక్కతో నిండిన పెద్ద చెరువు

సరుబుజ్జిలి: మినీ రిజర్వాయర్‌గా పిలిచే కొత్తకోట పెద్దచెరువు నిండా గుర్రపు డెక్క పేరుకుపోయింది. 175 ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువు ద్వారా సుమారు నాలుగు వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలి. అయితే చెరువులో 80 శాతం గుర్రపు డెక్క, పూడిక పేరుకుపోయింది. దీంతో ఆయకట్టు భూములకు సక్రమంగా సాగునీరు చేరని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మినీరిజర్వాయర్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికలను తొలగించాలని కోరుతున్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లింగరాజు

టెక్కలి: సామాజిక సేవలో యువత భాగస్వాములు కావాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక రోటరీనగర్‌లోని సత్యసాయి శాంతి సుధా మందిరంలో జోనల్ యూత్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ఆలోచన కలిగిన యువతకు సత్యసాయి సేవా సమితి ఒక వేదికగా నిలుస్తుందన్నారు. సేవా సమితి ద్వారా ఎంతోమంది యువకులు విస్తృతంగా సామాజిక సేవలు చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల జోనల్ కన్వీనర్‌గా నియామకమైన చంటిని సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా, జోనల్ సభ్యులు శివ, సాయి నిఖిల్, చంద్రమౌళి, మల్లేశ్వరరావు, అనాథగుప్త, నాగమణి, అన్నపూర్ణమ్మ, పి.కృష్ణారావు, నారాయణమూర్తి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24 మందికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు

మెళియాపుట్టి: మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం 24 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు చేశామని డాక్టర్ వేణుగోపాలరావు తెలిపారు. ఇల్లాయిపురం గ్రామానికి చెందిన ఆరుగురు, మర్రిపాడు–సీకి చెందిన ఐదుగురు, బందపల్లి నుంచి నలుగురు, వసుంధర నుంచి ఇద్దరు, కొసమాల, సిరియాకండి గ్రామాల నుంచి ముగ్గురేసి, కేరాసింగి, మెళియాపుట్టి నుంచి ఒక్కొక్కరు ఆపరేషన్లు చేయించుకున్నట్లు చెప్పారు. డాక్టర్ గ్రీష్మ, తొమ్మిది సచివాలయాలకు చెందిన ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష దేశానికే ఆదర్శం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

కొత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు సాంకేతిక కారణాలతో అందని కుటుంబాలను ఈ కార్యక్రమంలో గుర్తించి మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కులం, ఆదాయంతో పాటు పలు రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా మంజూరు చేసి అందజేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా బి.సి.రాయ్ జయంతి

సోంపేట: సోంపేట, ఇచ్ఛాపురం, పలాస ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.సి.రాయ్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్య వృత్తిలో బి.సి.రాయ్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సీనియర్ వైద్యుడు డాక్టర్ యారాడి కృష్ణమూర్తిని సత్కరించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ వైద్యవృత్తిలో పేద ప్రజలకు సేవ చేయడం ఆనందానిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ వైద్యులు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అప్పలరాజు, డాక్టర్ పి.శ్రీవాజి, డాక్టర్ దుర్యోధన, డాక్టర్ పి.రమేష్, మెడికల్ అసోసియేషన్ సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.